


# ఆంతర్యం

'మంజుశ్రీ'

సుందరవడివేలుకి బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది, తన కార్తికేయన్ విలాస్‌లో ఫామిలీ సెక్షన్‌కూడా వేరే ఏర్పాటు చేయాలని. ఆ ఊళ్ళో ఓ మోస్తరు హోటళ్ళు పదిదాకా ఉన్నాయి. తాలూకాఫీసుకి ఎదురుగా అయిదారు. ఊళ్ళో అక్కడక్కడ అయిదో, ఆరో ఉన్నాయి. తాలూకాకు ముఖ్యమైన ఊరు అది. ఏదో ప్రత్యేకత ఉండాలి తన హోటలుకు. అయితే ఇంత చిన్న ఊళ్ళో ప్రత్యేకంగా, పెద్ద పెద్ద నగరాల్లోని హోటళ్ళకు వలె ఫామిలీ సెక్షన్ ఎందుకని కొందరు నవ్వారు. అదృష్టవంతుడి ఆలోచనలన్నీ ప్రత్యేకంగా ఉంటాయి. ఎవరూ రారనుకున్న హోటలుకు కూడా రోజూ పది మంది ఆడపిల్లలూ, ఒకటి రెండు జంటలూ వస్తూనే ఉన్నారు. ఊళ్ళో ఆడపిల్లల కాలేజీ తెరవటం, ఆడస్టాఫ్ వడివేలు అదృష్టాన్ని నిరూపించాయి.

తన దగ్గిర హోటలు తెరిచిన నాటినుండీ పనిలో ఉన్న అబ్బునాథాన్ని ఆ ఫామిలీ సెక్షన్ పని అంతా చూసుకొమ్మని అప్పగించాడు. అబ్బునాధన్‌పై ప్రత్యేకమైన ఆదరాభిమానా లున్నాయి యజమానికి. ఎందుకంటే తంజావూరు ప్రాంతాలనుంచి ఇంతదూరం తెలుగు దేశపు వడిబొడ్డుకు పొట్ట చేత పట్టుకుని వచ్చాడు. చెక్కిళ్ళింకా పాలుగారుతూ ఉన్నాయి. ఎర్రగా, నొక్కుల నొక్కుల జుట్టుతో, గుండ్రటి ముఖంతో, అమాయికమైన కళ్లతో చూసినవాళ్లకు ఒక విధమయిన ఆకర్షణ, జాలి కలిగేట్లు ఉంటాడు. కాష్‌బాక్స్ దగ్గిర కూడా అబ్బు కూచుంటూంటాడు యజమాని వేరు పనులపైన తిరుగుతున్నప్పుడు. ఎదహారు, పదిహేడేళ్ళు ఇంకా నిండలేదు అబ్బుకు. పొట్టిగా హోటల్లో అంతా తానే అయి తిరుగుతూ, అజమాయిషీ చేస్తూంటాడు. అసలు ఫామిలీ సెక్షన్ పెట్టమని సలహా చెప్పి, యజమానిని ఒప్పించింది

స్తావా అబ్బే. బాగా కలిసివస్తే వ్యాపారాన్ని విస్తరించే వేళకు అబ్బును భాగస్వామిగా కూడా చేసుకుందామని యజమానికి ఆలోచన ఉన్నది.

లోపలికి ఓ సారి వెళ్ళి అన్నీ చక్కబెట్టి, విశ్రాంతిగా కూచున్నాడు అబ్బు ఫామిలీ సెక్షన్‌లోనే ఒక కుర్చీమీద. ఆ రూములో ఎవరూ లేరు.

అప్పుడు అబ్బు చాలా ఆశ్చర్యపడిపోయేట్లు, బహు నాజూగ్గా అలంకారం చేసుకుని కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుని ఒయ్యారాలుపోతూ అతిశయంగా ఓ అమ్మాయి వచ్చి లోపలి కుర్చీమీద కూచుంది. అబ్బు కెందుకో ఆ అమ్మాయిని చూడగానే విరసభావం కలిగింది.

వెనకాల కథానాయకుడు వచ్చాడు. సిగరెట్‌పెట్టి, అగ్గిపెట్టెకోసం నిమిషం వెనకబడినట్లుంది. అందు వల్లనే వన్నెల విసనకర్ర ఒక్కత్తే వచ్చి కూచుంది ముందు. వస్తూవస్తూనే 'ఆర్డరిచ్చావా?' అని తైతక్కలాడినట్లుగా అడిగాడు. ఆ వగలాడి కూలింగ్ గ్లాసెస్ తీసి ఎదురుగా పెడుతూ అలవోకగా "ఏమో, బాబూ, మీ రేం తింటారో నాకేం తెలీదు. త్వరగా తెమలండి. మళ్ళా హోపెనవరే ఉందన్నారు, రైలొచ్చేందుకు" అన్నది.

కథానాయకు డింతలో సిగరెట్ వెలిగించాడు. ఇంగ్లీషు సినిమాల్లోని విలన్‌కి లాగా మీసాలూ, చెవుల కింద పొడుగాటి పట్టీలూ—వేషం వేసుకుని వచ్చినట్లనిపించింది అబ్బునాథానికి.

"ఏమోయ్! తాజాగా స్వీటేముంది?"

అబ్బుకి ఒళ్ళు మండుకువచ్చింది. బావమరి దను కున్నాడా? ఏమిటా పిలుపు?

"ఏం లేవు" అన్నాడు ఒళ్ళు మండటం ఇతరులకు కనిపించకుండా.

"అంటే తాజాగా లేవా? అసలు లేవా? ఏం హోటలోయ్. ఎవరినో వాకబుచేస్తే ఊళ్ళో ఉన్న హోటళ్ళన్నింటిలోకి మీదే పేరుప్రఖ్యాతులున్న దన్నట్లు మాట్లాడారు" అన్నాడు అవహాస్యంగా.

ఆ కులుకులాడి నవ్వుతూంది. అందులో అంత హాస్య మేమున్నదో! అబ్బు ముఖం కందగడ్డలా ఎర్రగా చేసుకున్నాడు.

"పోనీలెండి, మీ రలా ఎద్దేవాగా మాట్లాడ కూడదు. చూడండి, పాపం. ఆ అబ్బాయికి చాలా కోపం వచ్చినట్లున్నది."

అబ్బాయన్న మాట అబ్బు అనే వినిపించింది అబ్బుకు. ముఖం ఇంకా కాస్త పెడసరం చేశాడు.

"పోనీ హోటయినా ఉన్నదా? అదీ లేదంటావా? పై పెచ్చు రిక్షాలో వచ్చాం ఏ హోటలుకు. వేరుగా రైలుస్టేషన్‌కే వెళ్ళవలసింది మేము" అన్నా డతడు.

"ఇది భోజనం టైం, సార్. ఇప్పుడు తయారవుతున్నాయి. హాట్ రెడీగా ఉన్నది. బజ్జీ, వడ, పకోడా..." ఏం కావాలన్నట్లు, తొందరగా చెప్పమన్నట్లు విసుగ్గా చూశాడు అబ్బు.

"ఇంతోటి హోటల్లో ఇంకా విసుగుకూడానా. ఫామిలీ సెక్షన్ ఉన్నదని ఎవరో అంటే వచ్చాం. అంతేకాని హోటలు మొహమే ఎరగనివాళ్ళను చూసినట్లు చూస్తావేం?"

"అవన్నీ ఎందుకు, సార్? ఏం కావాలో చెప్పండి" అన్నాడు అబ్బు, చూపగలిగినంత మర్యాద చూపుతూ.

> **అయినవాళ్ళు కానిపని చేస్తే, కానివాళ్ళలోనూ అయినవాళ్ళ పోలికలు అచ్చుగుద్దినట్లు కనిపించినప్పుడో, అంతర్యంలో ఆవేదన కలిగినప్పుడో, మనసు జివ్వుమంటుంది. మమత భగ్గుమంటుంది. వినయం జుగుప్సకు చోటిస్తుంది. మనస్సు చివుక్కుమంటే, అంతర్యంలో రగిలే అగ్నికి, కడివెడు కన్నీరు ఇంకిపోయి, కంటిలో ఎర్ర జీర ఇంద్రధనుస్సు రంగుల్ని రంగరిస్తుంది.**

"ఇదేనా మర్యాద? ఎండలో వచ్చాం కదా. మంచి నీళ్ళయినా తెచ్చి పెట్టావా? మంచినీళ్ళు కూడా లేవంటావా, కొంపదీసి. లేక మంచినీళ్ళన్నీ మీల్స్ సెక్షన్‌లో ఇస్తారంటావా?"

ఆ అందాల భామ కిసుక్కున నవ్వి "అవన్నీ మన కెందుకు లెండి. చెప్పండి, ఏం కావాలో" అంది.

"ఏం? ఆకలవుతున్నట్లున్నదే!" ఇదే చోటు కాబోలు వాళ్ళ సరససల్లాపాలకు.

అబ్బుకి చివుక్కుమనిపించింది. నిజమే, తాను పొరపాటు చేశాడు. ఎంతో చురుకుగా ఉండేవాడు. ఇవాళ ఆ పిల్లను చూడగానే మనస్సంతా ఎందుకో వికలమైపోయింది. మంచినీళ్ళు తెచ్చి ఇవ్వకపోవటం పొరపాటే. దెబ్బతిన్నాడు. ఇబ్బందిగా అక్కడినించి కదులుతూంటే "తయారవుతున్నాయన్నావుగా, ఏది తయారులోఉంటే అదే తీసుకురా. నాన్సెన్స్! స్వీట్ లేకపోతే, మా ఆవిడతో హోటలుకు రావటం దేనికి? పాకం గట్టిపడకపోతే అదే తీసుకురా" అని పురమాయించాడు.


"గుమగుమ సార్, కరకర సార్" అంటూ వచ్చిన కస్టమర్సందరిచేతా, కొత్త వాళ్ళచేతా కూడా బలవంతాన టిఫిన్స్, స్వీట్సూ తినిపించే అబ్బునాథానికి, ఈ జంట పక్షులకేమీ సర్వ్ చేయాలనిపించటం లేదు.

అయినా తప్పలేదు. మంచినీళ్ళు తీసుకుని, అప్పుడే సిద్ధంచేసిన మైసూర్‌పాక్ తీసుకుని, కసితీరగా కాస్త ఆలస్యంచేసినా, వాళ్ళకు సర్వ్ చేయక తప్పలేదు.

ఆ సుందరి సుకుమారంగా ఒక్క ముక్క తుంచి

తల్లి పిల్లలు

చిత్రం—ఎస్. రత్నాకర్ (నిర్మల్)



నోట్లో వేసుకున్నది. ఆ హీరో అమాంతం సగానికి కొరికి "బాగానే ఉన్నట్లుందే! తాజా సరుకు అనిపిస్తున్నదే. ఇంకా ఎప్పటిదో ఏమిటో కథ అనుకున్నాను" అన్నాడు అబ్బును ఉడికించటానికి అన్నట్లు.

"పాపం, ఎందుకండీ అట్లా ఆడిపోసుకుంటారు!" అంటూంది ఆ పిల్ల.

"మళ్ళీ ఇప్పు డార్డరిస్తే ఇంకో గంటకి కాని తేడు. తే ఏమున్నాయో! ఏమోయ్!" అంటూ అబ్బువేపు చూశా డతను. అబ్బుకి ఆ పళ్ళికల్లో ఉన్న గారెలూ, బజ్జీలూ, పకోడీలూ అన్నీ తెచ్చి ఆ పోజరాయుడి నెత్తిన గుమ్మరించా లనిపించింది.

వచ్చి కూచున్నవాళ్ళు చెప్పకముందే, బజ్జీప్లేటో, పకోడీలో తెచ్చి, "ఇప్పుడే తీశారు, శార్. వేడి వేడి టిఫిన్" అని చెప్పి తినిపించే అబ్బునాధానికి వీళ్ళకేమీ ఇవ్వకుండా—కనీసం మంచినీళ్ళుకూడా ఇవ్వకుండా వెళ్ళగొట్టాలనిపిస్తున్నది. ఎందుకో చిరాకు పుడుతున్నది వాళ్ళను చూస్తుంటే.

"ఏం తెమ్మంటారో చెప్పండి."

"ఇందా కేమిటో ఉన్నాయన్నవుగా—ఏమిటవి?"

'నీ బొంద!' అని మనసులో తిట్టాడు అబ్బునాథం. పళ్ళు పటపటలాడించుకున్నాడు, పైకి కనపరచకుండానే.

ఏడుపు స్వరంతో "వడ, బజ్జీ, పకోడీ" అన్నాడు.

"ఎందు కంత నీరసంగా ఉన్నా వబ్బాయ్? పైకి చూడటానికి కొబ్బరి ముక్కలానే ఉన్నావుగా. కూచో, టిఫిన్ చెయ్యి. కావలిస్తే నే విస్తాలే బిల్లు. ఈ వయసులో హుషారుగా ఉండకపోతే మరెప్పుడుంటావు?"

"అవన్నీ ఎందుకులెండి, సార్. మీకేం కావాలో చెప్పండి" అన్నాడు అబ్బునాథం, పొధ్యమైనంత మర్యాద ప్రదర్శిస్తూ.

"అది కాదోయ్. ఇట్లా నీరసంగా ఉంటే నా కిష్టం ఉండదు. చకచక, పికపిక, పకపక ఉండాలి."

"చాలెద్దురూ మీ సరసాలు. పాపం, చిన్న పిల్లాణ్ణి పట్టుకుని... బజ్జీ ఓ ప్లేటు తేఅబ్బాయ్."

అబ్బుకి కోపం వచ్చింది. 'మీసం, గడ్డం బాగా రాకపోతే, తనను చిన్నబ్బాయ్ అనుకుంటుంది కాబోలు దెయ్యం!' అని మనస్సులో విసుక్కున్నాడు.

"ఒక్క ప్లేటు చాలదు. రెండు తీసుకురా" అని కేకేశాడు, కదిలిపోతున్న అబ్బునాథానికి వినిపించే ఉద్దేశంతో అతడు.

"అబ్బునాథం తెచ్చిపెట్టి "కాఫీయా, టీయా?" అని అడిగాడు.

"అంటే ఇంకేం లేవనా?"

"ఏం కావాలో చెప్పండి."

"ఏమున్నాయో నువు చెపితే కదా!"

ఈ పీడ ఎంత త్వరగా తెమిలిపోతే అంతబాగుండు ననిపిస్తున్నది అబ్బుకి. మామూలుగా మాటకు మాట అంటేస్తూ, ఛలోక్తులూ, హాస్యోక్తులూ విసిరేవాడు అబ్బు, ఇంకోఅప్పుడయితే.

"బోరన్‌వీటా తీసుకురా!" అన్న దా వగలాడి.

"కాదు, నాకు ఓవల్టీన్" అన్నా డా వగకాడు.

'సిగ్గూ శరమూ లేదు. తమ వంటిల్లనుకున్నట్లున్నది ఈ రూము!' అని అబ్బు విసుక్కున్నాడు.

రెండు బోరన్‌వీటాలు తెచ్చి పెట్టాడు.

"చూశావా! నీ మాటే నెగ్గించాడు!" అన్నా డతడు.

ఇక వెళ్ళిపోతారు కదా అని నిట్టూర్చాడు అబ్బి.

ఆ బోరన్‌సీటా కప్పులు కిందపెట్టి, "ఏమిటో చూస్తున్నా అబ్బును దగ్గరకు పిలిచాడతడు. ఏముక్కున్నా తప్పలేదు. "బయట కిళ్ళీబడ్డీ నుంచి రెండు కిళ్ళీలు తెప్పిస్తావా" అంటూ ఆ కథానాయకుడు డబ్బు లిచ్చాడు. 'నే తేను' అని ఆ డబ్బులు నెత్తిన కొట్టడా మనిపించింది అబ్బుకి. కాని చేయి పట్టి తీసుకుని, అవతలకుపోయి క్లీనర్ కిచ్చాడు కిళ్ళీలు తెమ్మని. వాడు తెచ్చి ఇచ్చి పోయి వాళ కిమ్మన్నాడు. వాళ్ళు ఆ కిళ్ళీలు నములుకుంటూ బిల్లు చెల్లించి, హోటలు వాకిలి దాటుతుంటే, ఛీ, ఛీ, అనే దృష్టితో చూశాడు.

క్లీనర్లూ, వెయిటర్లూ, వంటవాళ్లూ అందరూ వచ్చి వింతగా వెళ్ళిపోతున్న ఆ జంట వైపు చూడటం అబ్బినాథానికి మండిపోయింది. అక్కడేమో, అది వింత. రోజూ చూసే దృశ్యం కాదు. ఏముక్కున్నాడు క్లీనర్లను. కని ఎవరిపైనా తన దూకుడు ప్రదర్శించే అవకాశం లేదు.

లోపలికి వెళ్ళి ఒంటరిగా కూర్చున్నాడు అబ్బినాథం.

ముసలి తండ్రి 'కణ్ణా, కణ్ణా' అంటూ కలవరిస్తూ ప్రాణాలు విడిచిన దృశ్యం కళ్ళముందు మెదిలింది. ముసలివాడు. చిన్నప్పుడే తల్లి చనిపోతే, ఆ హోటల్లో ఆ హోటల్లో వంటచేసి, ఆ పెద్ద మనిషిని ఆ పెద్ద మనిషిని కాళ్ళు పట్టుకుని తననూ, అక్కనూ పెద్ద వాళ్ళను చేశాడు. తనకు చిన్నప్పటినుండీ నాట్యమన్నా, సంగీతమన్నా ప్రాణంగా ఉండేది. హోటలునుంచి అలసిపోయి, తండ్రి ఇంటికి వచ్చి పాడుకునేవాడప్పు డప్పుడు. హోటల్ యజమానిని బతిమిలాడుకుని, తను వదలికీ అన్నం తెచ్చిపెట్టేవాడు. తాను సంగీతం నేర్చుకోటానికి పది రూపాయలు ఫీజు తండ్రి కట్టటం ఎందుకని. ఎళనియాండవర్ విలాస్‌లో సర్వర్‌గా చేరితే, తెలిసిన రోజున తండ్రి తన భుజంమీద చెయ్యి వేసి ఎంతగా ఏడ్చాడు! గొప్ప సంగీత కచేరీలు చేయాలని ఉండేది తనకు. రాత్రి పదకొండిదాకా, ఉరుకులు పరుగులమీద అందరికీ సర్వ్‌చేసి, అప్పుడు సంగీత పాఠం చెప్పించుకోటానికి వెళ్ళితే, కాళ్ళు తెగ లాక్కుని పోయేవి. తిప్పలు పుట్టేవి. గమకాలు పలుకుతూంటే కళ్ళు వాలిపోయేవి. నిద్ర వచ్చి ఒళ్ళు తూలేది. ప్రొద్దున్నే లేచి, ఇంకా డ్యూటీలో చేరకే ఒక్క రోజు

మెలకువున్నాడూ, ఒక్కపూటని చిన్న చిన్న పాట్లా లతో కటేవాడు. పంద కడితే పదిహేను వచ్చేవి. ఐదు పందలు కట్టేసి ఓ అర్ధరూపాయి సంపాదించే వాడు. ఆ అర రూపాయితో పండో, ఫలమో తీసుకు పోయి, గురువుగారి కిచ్చి, సాధన చేసేవాడు. శివ కామాక్షమ్మ గుడికి వెళ్ళి మ్రొక్కుకునేవాడు.

కాని తన సంగీత సాధన సాగలేదు.

తన తండ్రి దగ్గుతో క్షయ వచ్చేసిం దనుకున్నాడు.

కణ్ణమ్మ—తన అక్క—బంగారపు బొమ్మ. ఎదురింటి ప్రేమగా రబ్బాయితో స్నేహం చేసింది.

కణ్ణమ్మ తనని తల్లిలాగా చూసేది. తనకు ప్రాణ మైన అక్కయ్య లేచిపోయిందన్నారు ఇరుగూ పొరుగూ, పెళ్ళి చేసుకుంటానని కులం పోతుందంతో, మూడవ నాయతో.

"కణ్ణమ్మా, కణ్ణమ్మా" అంటూ లేచుకుని ఏడు

కుని తండ్రి హాస్పిటల్లో చచ్చిపోయాడు. తాను కడే రీలు కాదు చేసేది. శోకాలు తీశాడు. అక్కడ ఉండలేక పోయాడు. పళ్ళ కొట్ల వాళ్ళు, కాఫీహోటళ్ళ వాళ్ళు, కిళ్ళీకొట్ల వాళ్ళు తనను చూసి 'పాపం' అనుకునేవాళ్ళు. అది తాను సహించలేకపోయాడు.

ఇదుగో, ఇందాక వచ్చిందే పగలాడి, కణ్ణమ్మ కూడా అంతే ఎత్తు. అంతే లావు. అదే పసుపుఛాయ. అదే గుండ్రని ముఖం.

తండ్రి చచ్చాడనీ ఏడవడు;
అమ్మాయి పచ్చాడనీ ఏడవదు.
ఎక్కడుందో! ఏమైందో! ఏం చేస్తుందో!

ఒక చేయిపైన ఒక చేయి ఇంటూలాగా చేసి, ఆ కలిసిన చోట తల ఆన్చి, ఆ చేతుల తలుపు బొడిలు మీద చేర్చి, అబ్బినాథం కళ్ళనిండా నీళ్ళు పెట్టు కున్నాడు. ★

# ఉత్తరాలు

(2 వ పేజీ తరువాయి)

ఉంది. వివాహితకు మాంగళ్యాన్ని కాపాడుకోవడమే ప్రథమ కర్తవ్యంగా మరొక సందేశాన్నిచ్చారు.

—టి. విమల (నెల్లూరు)

* * *

23–7–69 వ తేదీ సంచికలో 'ధర్మవీర' బొమ్మల సీరియల్ బాగానే ఉన్నది. శ్రీ బంటి వేసిన 'కార్టూను' చాలా బాగుంది.

—టి. వై. జి. రాంకుమార్ (హైదరాబాద్)

* * *

ఈ వారం (30—7—69) ఆంధ్రప్రభ ముఖచిత్రం చాలా ఆకర్షణీయంగా ఉంది.

63 వ పేజీలో ఉన్న పక్షుల జంట బాగుంది.

'ప్రమాదవనం' లో హేమలతా విల్సన్‌గారి డిజైన్ చక్కగా ఉంది. అప్పుడే నేను కుట్టి చూశానుకూడా! చక్కగా కుదిరింది.

సీరియల్ నవలలు రెండూ ఉత్కంఠత కలిగిస్తున్నాయి. 'భారతి' సీరియల్‌ని మంచి సస్పెన్సులో ముంచి ఆపేస్తున్నారు.

—కుమారి బి. ఆర్. ఇంద్రాణి (ఏలూరు)

* * *

ఈ వారం ప్రభలో ప్రచురితమైన 'ముగ్గురు మొండివాళ్ళు' కథ చాలా బాగుంది.

—మారెళ్ళ గంగరాజు (జగన్నాథపురం—ఒరిస్సా)

* * *

30—7—69 వ తేదీ సంచికలోని 'ఏడుకొండల స్వామి రథోత్సవం' చిత్రం చాలా బాగున్నది.

ఈ వారం ప్రచురితమైన 'ముగ్గురు మొండివాళ్ళు' కథానిక బాగున్నది. పోచమ్మ పాత్ర బలహీనంగా ఉన్నది. తల్లికి బుద్ధి రావటానికై చేస్తున్న ప్రయత్నాన్ని రాధ పోచమ్మ అడ్డగించిన సందర్భంలో చెప్పి ఉండాల్సినది. పాఠకులు సస్పెన్సు వీడకుండానే కథాంతం ఊహించుకోగలరు.

—కప్పలూరు దివాకరరావు (పార్వతీపురం)

కె. ఆర్. విజయ ముఖచిత్రంతో ప్రభ అందంగా, ఆకర్షణీయంగా వెలువడి నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ముద్రణ, గెటప్ రానురాను బాగుంటున్నవి. ఈ వారం ప్రచురించిన నాలుగు కథలు ఆణిముత్యాల్లాంటివి. ముఖ్యంగా 'ముక్తి', 'ముగ్గురు మొండివాళ్ళు' కథలు బాగున్నవి. సీరియల్స్ రెండూ ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. కార్టూన్స్, చిలకమర్తి ప్రహసనాలు చాలా హాస్యోక్తంగా ఉన్నాయి. ఎ. వి. రత్నంగారి 'పెద్దపిల్లలు—పెళ్ళిళ్ళు' వ్యాసం చాలామందికి కనువిప్పు కలిగించక మానదు. మీరు మధ్యమధ్య ప్రచురించే 'సూక్తులు', 'టిట్ బిట్స్', 'రేఖాచిత్రాలు', 'ఫోటోలు' ప్రభ స్థాయిని పెంపొందింప చేయుచున్నవి. విశ్వంగారి 'మాణిక్యవీణ', 'వింతలు-విడ్డూరాలు' వన్నెతెచ్చుచున్నవి.

—ఎస్. ఆర్. ప్రతాపరెడ్డి (పల్లిబసాయపల్లె)

* * *

'మారిన కాలం—మారని మనుషులు' సీరియల్ చాలా బాగుంది. సీరియల్‌లోని సంభాషణలు చదివి నప్పుడు నా హృదయం ద్రవించి కళ్ళు చెమర్చాయి. రుక్కు పాత్రను ఎంతో ఉదాత్తంగాను, గంభీరంగాను పోషించారు. ఎస్. ఎస్. ఆర్. మూర్తిగారి 'ముక్తి', శ్రీవత్సగారి 'పరాజితుడు' కథలు చాలా బాగున్నాయి. 'భారతి' సీరియల్‌కూడా బాగుంది.

—బోగా నరసింగరావు (సికింద్రాబాదు—25)

* * *

ఈ వారం (23—7—69) మీరు ప్రచురించిన 'స్వీకారం' కథానిక చాలా బాగుంది. పూర్తిగా చదివిన పిమ్మట కన్నీటి బొట్లు రాలినవి. కథ కొత్త తరహాగా నడిచింది. నాకు తెలిసినంతవరకు ఇలాంటి కథ ముందెన్నడూ చదవలేదు.

—వజ్రాల యశ్వంతరావు (కల్యాణి ఖని)

* * *

మీరు ప్రతి వారం ప్రచురించుచున్న శాస్త్రి గారి 'వింతలు—విడ్డూరాలు' శీర్షిక మమ్మల్ని బాగా ఆకర్షించింది. ప్రభ రాగానే ముందుగా మేము చదివే శీర్షిక ఇదే. ఆ తరవాత విశ్వంగారి 'మాణిక్యవీణ' చదువుతాము. ప్రస్తుతము మీరు ప్రభలో ప్రచురిస్తున్న కొమ్మూరి వేణుగోపాలరావుగారి 'భారతి' సీరియల్ చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంటూంది!

—చిల్లా శేషు, సాంబశివరావు (మద్రాసు—59)

* * *

16—7—69 వ తేదీ ముఖచిత్రం వెంకటేశ్వరుని బొమ్మ చాలా బాగున్నది. దీని తరవాత ప్రభలో శ్రీ బంటిగారి కార్టూను బాగున్నది. మా ప్రభలో ఎక్కువగా కార్టూనులు ప్రచురిస్తే ఎక్కువ శోభ రాగలదని నా ఆశ.

—పి. వి. రమణమూర్తి (న్యూఢిల్లీ)

* * *

23—7—69 వ తేదీ సంచికలోని తిరుపతయ్యగారి 'వెలుగని దీపం' బాగుంది. కమల భర్త స్థానంలో ఉన్న ఎవరైనా అపార్థమే చేసుకోనక తప్పదు. రచయితకి తెలియదేమో మరి. ముక్కూ, మొహం తెలియని ఆ వచ్చిన వ్యక్తిని గురించి ఏమనుకోవాలి. ఏమైనా కమలపై ఆమె భర్త అంత అమానుషంగా ప్రవర్తించడం